ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి 2025
5
అల్లూరి సీతారామరాజు



దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు: పేద తరగతి కుటుంబం నుండి వచ్చిన దామోదరం సంజీవయ్య స్వయం కృషితో ఎంతో ఎత్తుకు ఎదిగి ముఖ్యమంత్రి పదవిని అలంకరించారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. అటువంటి మహనీయుని స్ఫూర్తిగా మనమందరం ప్రజల కోసం శ్రమించాలని సూచించారు. దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంజీవయ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా ఖ్యాతి పొందారని తెలిపారు. 38 సంవత్సరాల అతి చిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మలత, ల్లా సాంఘిక సంక్షేమ అధికారి జనార్ధనరావు, డిఇఓ పి.బ్రహ్మాజీరావు, ఉద్యాన వ్యవసాయ జిల్లా అధికారులు ఎస్బి ఎస్ నంద్, రమేష్ కుమార్‌రావు, డిపిఆర్ఓ పి.గోవింద రాజులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాట ఫలితంగా..

గిరిజన గ్రామాలకు విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి-అనంతగిరి: కొండ శిఖరు గిరి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గతంలో సిపిఎం పోరాట ఫలితంగా ఏడు గిరిజన గ్రామాలకు విద్యుత్ కాంతులు వెగడంతో గిరి పుత్రులు డప్పులు వాయిస్తూ దింసా నృత్యం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పోరాటం ద్వారా విద్యుత్ సాధించుకొన్న ఆనందంతో ఏడు గ్రామాల గిరిజనులు బూరిగ గ్రామం వద్ద గురువారం రాత్రి నృత్యం చేస్తూ ఆనందంలో మునిగి తేలారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయితీ పరిధి బూరిగ, చిన్నకోనెల, డేంజనువలస, బొంగిజ రాయపాడు,. సిమిడివలస,. పెద్దవలసలకు విద్యుత్ సౌకర్యం లేక ఆయా గిరిజన గ్రామాల ప్రజలు రాత్రుల సమయంలో అంధకారంలో మగ్గేవారు. ఈ గ్రామాలు ఎత్తైన కొండ అటవీ ప్రాంతంపై ఉన్నాయి. రాత్రుల సమయంలో అటవీ విషపూరితమైన జంతువులు ఏ సమయం లో పశువులు, మనుషులపై. దాడి చేస్తాయోనని భయాందోళనతో బిక్కు బిక్కుమంటూ గడిపేవారు. రాత్రుల సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న వారిపై పాములు కాటు వేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

ఈ సందర్భంగా సిపిఎం వార్డ్ మెంబర్ సోమ్మెల. అప్పలరాజు మాట్లాడుతూ, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యాన అనేక మార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో దిగివచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించిందని తెలిపారు. సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, తమ పోరాటం ఫలితంగా స్పందించిన ప్రభుత్వం దిగివచ్చి రొంపల్లి పంచాయతీ ఏడు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కొండ శిఖరం గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించిన కలెక్టర్, విద్యుత్ శాఖ సిఎండీ, ఉన్నతాధికారులకు గిరిజనుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



ఆనందంతో సంప్రదాయ నృత్యాలు చేస్తున్న గిరిజనులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పరిశుభ్రత, మెనూ అమలు తీరును పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి పాఠాలు ఎలా బోధిస్తున్నదీ విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు పాఠాలు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, వేడి వేడి ఆహార పదార్థాలు పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలన్నారు. ప్రతినెల కూరగాయలు, నిత్యవసర సరుకులు వెండర్లు ఈ విధంగా సరఫరా చేస్తున్నదీ ఆరా తీశారు.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి



ప్రచారం చేపడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి: ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థి గోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి .గంగరాజు, మండల యుటిఎఫ్ ప్రతినిధులు ప్రచారం చేపట్టారు. కొత్తవలస బాలుర, బాలికల పాఠశాలలో సందర్శించి ప్రచారం నిర్వహించారు ఉపాధ్యాయ సిబ్బంది సమస్యలపై నిరంతరం పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిచాలని కోరారు. చట్టసభల్లో సమస్యల పట్ల గొంతు వినిపించే నాయకులకు మొదటి ఓటు ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సర్పంచ్ కిలో. మోసియా, నాయకులు నాగులు పాల్గొన్నారు.

అనంతగిరి రూరల్: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని జడ్పిటిసి గంగరాజు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టసభలలో ఉపాధ్యాయుల, పాఠశాలల బలోపేతానికి కృషి చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్యా, గిరిజన సంఘ నాయకులు సోమెల నాగులు, అనంతగిరి మండల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల

మన్యంలో ముమ్మర ప్రచారం

విజయ్‌గౌరిని గెలిపించాలని అరకులోయ మండలంలోని ఏపీ గురుకులం పాఠశాలలో,కళాశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలలో శుక్రవారం ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. గురుకుల పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలిపారని గుర్తు చేశారు. విజయ్ గౌరిని ఎమ్మెల్సీగా గెలిపించి చట్టసభలో పంపిస్తే సమస్యలపై శాసనమండలిలో లేవనెత్తి పరిష్కరించే విధంగా కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఆదివాసి సంఘం మండల నాయకులు కె రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్ర



నినాదాలు చేస్తున్న నాయకులు, తల్లిదండ్రులు

పాఠశాలల మూసివేత నిర్ణయంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి- పెదబయలు :మండలం లో 32 ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర కూటమి ప్రభుత్వం మూసేయాలని ఆదేశాలు జారీ చేసిందని ఆదివాసీ గిరిజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు సన్నిబాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రోగులపేట పాఠశాల వద్ద గిరిజనులతో నిరసన చేపట్టారు. ఇందులో భాగంగానే రోగులపేట, దగ్గుపాడు, పెద వంచరంగి, కొత్తపుట్టు, ఉగ్రగరువు, కుమ్మరిపుట్టు, గజ్జడి, ,గోచారి, సాలెవులు, బొర్లాడ , గంపరాయి, బుడ్డపుట్టు తదితర పాఠశాలల్లో చదువుతున్న మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులను వేరొక పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం కుటీల ప్రయత్నాలు చేస్తుందన్నారు.ఆదివాసి ప్రాంతాల్లో గిరిజన బిడ్డలను ప్రాథమిక విద్య నుండి దూరం చేయకుండా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సన్నిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ రోగులపేట కార్యదర్శి జుంబు దేవరాజు, సీత గుంట పంచాయతీ వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ బొండా రత్నకుమారి, జంబు ప్రభాకర్, కోటి బాబు, భీమన్న, హరిచంద్రరావు, కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకుల కిట్లుతో గిరిజనులు

ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : రేఖపల్లి ఎఎస్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దర్భలంక, తోటపల్లి గ్రామాలలో తాటాకులతో కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాల్ ఏర్పాటుకు శ్రమదానం చేసిన స్థానికులకు ఎఎస్‌డిఎస్ ద్వారా తోటపల్లిలో 178 మందికి, దర్భలంకలో 50 మందికి నిత్యవసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలో సమస్యలపై చర్చించుకోవడానికి, వైద్య శిబిరాలు, పల్స్ పోలియో క్యాంపు నిర్వహణకు ఈ కమ్యూనిటీ హాల్ ఉపయోగపడుతుందని స్థానికులు తెలిపారు. కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకరించిన ఏఎస్‌డిఎస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ గాంధీ బాబుకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డిఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్.సాయి చైతన్య, సౌజన్య, నేరుపటి రవి, సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మహా శివరాత్రి జాతరకు పటిష్ట ఏర్పాట్లు

-సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రముఖ శైవ క్షేత్రం మత్స్యగుండం మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పేర్కొన్నారు. ఈనెల 25, 26, 27 తేదీలలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న మత్స్యగుండం జాతర ఏర్పాట్లపై శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులు, ఉత్సవ కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్య కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు రోజులు తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. నిరంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని హుకుంపేట వైద్యాధికారికి చెప్పారు.మెరుగైన పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని పంచాయితీ అధికారులకు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మత్స్య గుండం సమీపంలో గజ ఈత గాళ్లను నియమించాలని మత్స్యశాఖ అధికారులకు చెప్పారు. జిసిసి స్టాల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులకు రవాణా ఇబ్బందులు లేకుండా బస్సులు నడపాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులందరూ ముందుగా మత్స్యగుండం సందర్శించి పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కార్యాలయపు పరిపాలనాధికారి పోల రాజు, హుకుంపేట తాహశీల్దారు కె.జయ ప్రకాష్, గిరిజన సంక్షేమ శాఖ డి.ఇ . ధృవ, పంచాయితీ రాజ్ ఎ ఇ సంజీవరావు, ఉత్సవ కమిటీ చైర్ పర్సన్ , సర్పంచ్ ఎస్. శాంతకుమారి, అధ్యక్షులు మినుముల గోపాల పాత్రుడు, ప్రధాన కార్యాదర్శి. పాంగి కొండబాబు, కోశాధికారి చెట్టి హరినాధ్ ఆలయ కమిటీ సభ్యులు తమర్బ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో పారదర్శకంగా పోస్టుల భర్తీ

- వదంతులు నమ్మి మోసపోవద్దు
- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 34 కేటగిరీలలో ఖాళీగా ఉన్న 244 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పోస్టులు అమ్ముకుంటున్నారన్న వదంతులు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వదంతులు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఎవరూ ఎవరికీ డబ్బులు ఇచ్చి మోస పోవద్దని సూచించారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం నోటిఫై చేసిన పోస్టులను రోస్టర్ అనుసరించి మాత్రమె ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. నియామకం, ధృవపత్రాల పరిశీలనకు ఒక నోడల్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల మార్కుల లిస్టులు, అనుభవం తదితర అంశాల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకటించడం జరుగుతుందని, మెరిట్ లిస్టు ప్రకారమే తుది జాబితా ప్రకటించి భర్తీ చెయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. వదంతులను, రూమర్లను నమ్మవద్దని, ఎవరైనా డబ్బులు అడిగినట్లు తెలిస్తే కళాశాల ప్రిన్సిపాల్ కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలవరం ముంపు బాధితులకు

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు

పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి స్థాయిలో అమలు చేయడం జరుగుతుందని పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్ పేర్కొన్నారు. స్థానిక పిఎంఆర్‌సిలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుపై రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీతో కలిసి ఆయన ఆర్ అండ్ ఆర్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్ మాట్లాడుతూ ఇప్పటికే చాలా గ్రామాలకు చెందిన ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేశామన్నారు. రంపచోడవరం డివిజన్లో రెండు, చింతూరు డివిజన్లో నాలుగు ఆర్ అండ్ ఆర్ కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన గిరిజనులకు గంగవరం మండలంలోని నేలదోనెలపాడు గ్రామంలో ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గిరిజనేతరులకు గోకవరంలో పునరావాస కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చింతూరు డివిజన్లో జులై, ఆగస్టు నెలలలో వచ్చే వరదలకు ముందుగా కొన్ని ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మునినికుంట ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించి వారి సమస్యలపై వినతి పత్రాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిశీలించి వారి అర్హతను బట్టి నివేదికల ప్రకారం ప్యాకేజీ రాని వారికి ప్యాకేజీ అమలు కొరకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తహశీల్దార్ కరక సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ దాసు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఆర్ ప్యాకేజీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్, సబ్ కలెక్టర్ కల్పశ్రీ



శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేస్తున్న ఆకులూరి గ్రామస్తులు

శ్రమదానంతో రహదారికి తాత్కాలిక మరమ్మతులు

- పునర్నిర్మించాలని ఆకుకూరు గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ ఆకులూరి గ్రామానికి వెళ్లే రహదారికి ఆ గ్రామస్తులు శ్రమదానం ద్వారా మరమ్మతులు చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 8న వరద బీభత్సానికి ఆకులూరు రహదారి కొట్టుకుపోయింది. దీంతో తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అనేక అవస్థలు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పివిటిజిలకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని, ఇసుక, సిమెంటు, ఇనుము, పిక్క, ఇతర నిర్మాణ సామాగ్రి గ్రామానికి తరలించాలంటే రహదారి సౌకర్యం లేక అనేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఈ రహదారి పునర్నిర్మాణం చేయాలని పాడేరులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసినా అధికారులు ఇప్పటివరకు తమ గోడును పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేక గ్రామస్తులంతా కలిసి శ్రమదానంతో రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ స్పందించి వెంటనే తమ రహదారిని పునర్నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరారు.

పీసా చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలో ఉన్న గిరిజనులు, గిరిజనేతరలు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పీసా శిక్షణ తరగతుల పరిశీలన అధికారి రమేష్ అన్నారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, కో- ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పీసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, పంచాయతీ వార్డ్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై జరుగుతున్న శిక్షణా తరగతులను రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా చట్టం అంటే పంచాయతీ రాజ్ చట్టానికి ఎక్స్‌టెన్షన్ అని, షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సొంత ఆలోచనలతో స్వయం పరిపాలన చేసుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ చట్టం ద్వారా గిరిజనులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, ఇతర అంశాలపై పీసా గ్రామసభలు ద్వారా స్వయం నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అమలు చేయవచ్చని చెప్పారు. సామర్లకోట ఈటిసి శిక్షణ కేంద్రం అబ్జర్వర్ పద్మజ, ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమోటిలు ఏ.కోటేశ్వరరావు, ఇంచార్జ్ ఈఓఆర్డి, పంచాయతీ కార్యదర్శులు కోనేటి రాంబాబు, రొంగల కిశోర్, సుమర్ల రాంబాబు, గోవిందరాజు, కె బాలురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిక్షణ తరగతుల పరిశీలకులు రమేష్

గుండెపోటుతో హెచ్ఎం మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వెంగర్తి ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న కోసం సత్యనారాయణ దొర (48) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. సత్యనారాయణదొర కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం ఆయనకి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో తన స్వగ్రామమైన లాగరాయిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సత్యనారాయణ దొరకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎంతో మంచి మనిషిగా పేరున్న సత్యనారాయణ దొర మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సత్యనారాయణదొర కుటుంబ సభ్యులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయభాస్కర్ దంపతులు పరామర్శించి సంతాపం తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.25 వేలు తక్షణ ఆర్థిక సహాయం మృతుని కుటుంబ సభ్యులకు ఎంఈఓలు సత్యనారాయణ దొర, సూరారెడ్డిలు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు పాల్గొన్నారు.



తక్షణ సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

18,19 తేదీల్లో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, చింతూరు డివిజన్ కేంద్రాల్లో ఈనెల 18, 19తేదీల్లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ ఒక ప్రకటన లో పేర్కొంది. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ సంయుక్త కలెక్టర్ పాడేరు ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు ఈనెల 18న రంపచోడవరం డిగ్రీ కళాశాలలో, 19న చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఆయా ప్రాంత యువకులు ఔత్సాహికులు హాజరై రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను విస్తరించేందుకు కార్యవర్గం సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగు తుందని, జిల్లా ప్రజలందరూ తమకు సహకరించాలని ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, వైస్ చైర్మన్ గంగరాజు కార్యవర్గ సభ్యులు కోరారు.

వరుస మరణాలతో భయాందోళన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ డాబవలస గ్రామంలో గురువారం రాత్రి ఇద్దరు వృద్ధులు మరణించారు. వరుస మరణాలతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.జనవరి నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు రెండు నెలల వ్యవధిలోని ఎనిమిది మంది చనిపోయారు. వరుస మరణాలు సంభవిస్తుండడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. వైద్యాధికారులు తమ గ్రామంలో మెడికల్ క్యాంపు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించారు. బాల్య వివాహల నియంత్రణపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు స్థానిక ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమలో ఎంఇఒ 2 గుమ్మా పుష్పవతి, సిడిపిఒ వరహాలమ్మ పాల్గొన్నారు

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్ యుపిహెచ్‌సిలను శుక్రవారం డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ఆయా ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు అందుతున్నసేవలు, మందుల లభ్యత, పలు సర్వేలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని, సిబ్బంది సమయపాలన, ఫేషియల్ హాజరుపైవైద్యులు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. డ్రైడేఫ్రైడేలో పాల్గొన్ని దోమలు నిర్మూలన, పారిశుధ్యం అమలు, డెంగీ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక పాల్గొన్నారు.

పేపర్ మోడలింగ్‌పై గీతం వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ: పాఠశాల స్థాయి విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, ఆర్కిటెక్చర్ పట్ల అవగాహన పెంచడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో శుక్రవారం పేపర్ మోడలింగ్‌పై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రముఖ ప్యాకేజింగ్ డిజైన్ నిపుణుడు, జాతీయస్థాయి సంస్థలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం గల అరుణ్‌దేశాయ్ పాల్గొని, విద్యార్థులకు పేపర్ మోడలింగ్‌పై అవగాహన కలిగించారు. పేపర్ ఉపయోగించి వివిధ రకాల ఆకృతులు, నిర్మాణాలను రూపొందించడంపై విద్యార్థులతో ఆసక్తి కలిగించేలా పేపర్ మోడలింగ్‌లను తయారు చేయించారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ ప్రొఫెసర్ విభూతి సత్యదేవ్, నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయతోపాటు పోలాక్స్, ఇంటెల్లి తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

ఏర్పాట్లుపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సమీక్ష


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు, : రానున్న పదవ తరగతి రెగ్యులర్, ప్రైవేటు, సార్వత్రిక (ఓపెన్ స్కూల్) పరీక్షలు, ఇంటర్మీడియట్ రెగ్యులర్, సార్వత్రిక (ఓపెన్ స్కూల్) పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా పరీక్షలు లోటు పాట్లకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలోనికి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకు వెళ్లరాదన్నారు. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల భవనాలపై కూడా నిఘా పెట్టాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలని, సమయం మించిన పిదప అనుమతించరాదని పేర్కొన్నారు. మార్చి 17 నుండి 31 వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందుకు గాను 71 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని, అందులో 18 కేంద్రాలలో ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా జరుగుతాయని వివరించారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 15,055 మంది హాజరు కానున్నారని తెలిపారు. సార్వత్రిక విద్యా విధానంలో (ఓపెన్ స్కూల్) 1,699 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మార్చ్ ఒకటవ తేదీ నుండి 20 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, ఇందుకు జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా మార్చ్ మూడవ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగుతాయని, ఇందుకు గాను ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ నెల 11న జరగవలసిన బంద్ కారణంగా వాయిదా వేసిన ప్రాక్టికల్ పరీక్షను ఈ నెల 20 వ తేదీన అదే కేంద్రంలో జరుగుతుందని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మలత, డిఇఓ పి. బ్రహ్మాజీ రావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్.రజని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. అప్పల రాము, సహాయ కమిషనర్ (పరీక్షలు) శశి కుమార్, డిపిఓ లవరాజు, డివిజనల్ పి. పిఎస్ కుమార్, ఐపిఓసిఎల్ ఇఇ అప్పారావు, ఆర్టీసి డిఎం ఉమామహేశ్వర రావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. దీనబంధు పాల్గొన్నారు.

వచ్చే నెల 28న జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - సీతమ్మధార : జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏటా మాదిరిగానే వచ్చేనెల 28న ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం అక్కయ్యపాలెం జంక్షన్‌లోని ప్రైవేట్ హోటల్‌లో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఆ రోజున అల్లూరి విజ్ఞాన కేంద్రంలోకవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం, లక్కీ డిప్, వంటికార్యక్రమాలు ఉంటాయన్నారు.

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ఇళ్ల వంటి హామీల అమలుకు ఈనెల 24నుంచి జరగనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని రాష్ట్ర కార్యవర్గం ద్వారా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు వినతులు అందజేయనున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ అర్బన్ అధ్యక్షుడు పి నారాయణ కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 650 సభ్యత్వాలు నమోదయ్యాయని, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సభ్యత్వ నమోదు చేపడతామన్నారు.కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు డి.రవికుమార్, ఎస్ఎం శివరావు, ఇ.ఈశ్వరరావు, కె.మదన్, జగన్మోహన్, కొచ్చెర్ల శ్రీనివాస్, జి.రాంబాబు, ఆనంద్, రంగధామం, సీతారామమూర్తి, రాజశేఖర్, నాయుడు గణపతి, బి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు

గీతం ఎన్‌సిసి కేడెట్ ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ: ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సిసి నేవీ యూనిట్ ప్రాతినిధ్యం వహించి సత్తాచాటిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ బిఎస్‌సి కోర్సు విద్యార్థి వినీల్ దీక్షితను శుక్రవారం కాలేజీలో అభినందించారు. జాతీయ స్థాయిలో 2500 మంది ఎన్‌సిసి కేడెట్‌లతో పోటీ పడి ప్రతిభ ఆధారంగా అగ్రనేతల ముందు ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌లో వినీల్‌దీక్షిత్ అత్యుత్తమ ప్రదర్శన చేశారని గీతం క్రీడా విభాగం డైరెక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. పలు జాతీయ స్థాయి క్యాంప్‌లకు ఎంపికైన వినీల్ దీక్షిత్ ఎన్‌సిసి నౌకాదళ యూనిట్‌లో ఉత్తమ కేడెట్‌గా నిలిచాడనిఅభినందించారు.

అధునాతన సాంకేతికతపై వర్క్‌షాప్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని కొండపు నడింపల్లి సత్యనారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అత్యాధునిక సాంకేతికలపై శిక్షణనిచ్చారు. భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సిటిటిసి) సహకారంతో ఐసిఇ, ఇఇఇ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులకు వారి కెరీర్ అభివృద్ధికి అవసరమైన అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. సిటిటిసి నిపుణులు ఇండస్ట్రీ 4.0, ఆటోమేషన్, లాట్, రాబిక్ మాన్యుఫ్యాక్చరింగ్, 3డి ప్రింటింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.ఎన్‌ఎస్‌ఐటి చీఫ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పిఎస్.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, ఐఐఐ లీడ్ డాక్టర్. పిఎన్ఇ. నవీన్, కోలీడ్ పి.కావ్య స్టూడెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భర్త వికృత చేష్టలు తాళలేక
వివాహిత ఆత్మహత్య


మృతురాలు వసంత (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్‌లో గురువారం రాత్రి వివాహిత ఆత్మహత్య ఘటన స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం కెజిహెచ్ వద్ద మృతురాలి బంధువులతోపాటు గోపాలపట్నం సిఐ జి.అప్పారావు తెలిపిన వివరాలివి.

నందమూరినగర్‌కు చెందిన చిక్కాల నాగేంద్రబాబుకు గాజువాక ప్రాంతానికి చెందిన ఏడువాక వసంత (24)తో 11నెలల క్రితం వివాహమైంది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నాగేంద్రబాబు పెళ్లయిన నాటి నుంచి భార్య వసంతను లైంగికంగా అనేక వేధింపులకు గురిచేసేవాడు. భర్త వికృతచేష్టలు, లైంగిక వేధింపులు భరించలేని వసంత తన తల్లిదండ్రుల వద్ద గోడును వెల్లబోసుకునేది. గురువారం రాత్రి కూడా అదేమాదిరిగా సెక్స్యువల్ వేధింపులకు గురిచేయడంతో తన బావకు విషయాన్ని వాట్సాప్‌లో మెసేజ్ పెట్టిందని మృతురాలి బంధువులు అంటున్నారు. ఎప్పటికీ భర్త తీరులో మార్పు రాకపోవడంతో మానసిన వేదనకు గురైన వసంత గురువారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టిందని మృతురాలి బంధువులు తెలిపారు. స్థానికులు ఆమెను ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ అప్పటికే మృత్యువాత పడిందని వైద్యులు ధ్రువీకరించారు.

దీనిపై సిఐ అప్పారావు మాట్లాడుతూ, గురువారం రాత్రి 100కు ఫోను కాల్ రావడంతో వెంటనే అప్రమత్తమై నందమూరినగర్‌కు వెళ్లామన్నారు. మృతురాలి తల్లిదండ్రులు సన్యాసమ్మ, వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, వసంత బలవన్మరణం ఘటన ప్రత్యేక కేసుగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి బంధువులిచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, నాగేంద్రబాబును అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని నుంచి ఫోను, ట్యాబ్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ కుమార్

ప్రజాశక్తి అనంతగిరి: పీసా చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో ఏవివి. కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ శెట్టి. నీలవేణి, జెడ్పిటిసి దీసరి.గంగరాజు సమక్షాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోసియా. సింహాద్రి, రూతు, సెక్రటరీ దేవా, రామస్వామి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కె . సుందర రావు, పీసా. వార్డు మెంబర్ సభ్యులు పాల్గొన్నారు



విశాఖలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు

బీమా రంగంలో..
100 శాతం విదేశీ పెట్టుబడిపై నిరసనలు

బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడిని వ్యతిరేకిస్తూ శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు నిరసనలు తెలిపారు. ప్రభుత్వ చర్యను ఖండిస్తూ పెద్దపెట్టున నినదించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అనుమతి ఇవ్వడం మంచిది కాదని, దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక ప్రగతికి ప్రమాదకరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. విశాఖలోని ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐసిఆర్ఇఎ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసి పెన్షనర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అవకాశమిస్తే కంపెనీపై విదేశీ భాగస్వామికి పూర్తి స్వేచ్ఛ, అదుపు ఉంటాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాల అమలుకు దేశీయ పొదుపు చాలా కీలకమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీల్లోని విదేశీ భాగస్వాములు తమ షేర్లను ఉపసంహరించి, లాభం వచ్చే చోటుకు బదిలీ చేసే అవకాశం ఉందని, అలా చేస్తే ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు పట్టాదారులు కూడా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తపరిచారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.మోహన్‌రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్ఐసి పెన్షనర్లు అందరూ బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడిని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి, పార్లమెంటుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బిబి.గణేష్, ఎన్ఆర్.ఠాగూర్, ఎ.తిరుమలరావు, బిటి.ప్రసాద్, ఎఎస్.రవిశేఖర్ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు, ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ పిఎస్.సుబ్బారావు మాట్లాడుతూ బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడి పెంపు ప్రతిపాదన స్వదేశీ పొదుపు మొత్తాలపై అధిక నియంత్రణకు దారితీస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మళ్ల చంద్రశేఖర్, వివిఎన్‌కె.హరినాథ్, జగదేశ్వరరావు, జంపా రమేష్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ చిరు వ్యాపారుల సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరా తీశారు. శుక్రవారం పూర్ణా మార్కెట్ నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు పాదయాత్రగా వెళ్లి వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న పరిణామలపై వారితో చర్చించారు. ప్రభుత్వ అధికారులు సమూలంగా దుకాణాలను ఖాళీ చేయడం పట్ల సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ సిబ్బంది చేపట్టిన చర్యలు పట్ల ఎమ్మెల్యే వివరణ కోరారు. అధిక ఆశీలు వసూళ్లు, పలువురు గుత్తాధిపత్యం చేస్తున్న అంశాలు ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకెళ్లారు.

పోర్టును సందర్శించిన నాగాలాండ్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అధ్యయన యాత్రలో భాగంగా నాగాలాండ్ విశ్వవిద్యాలయం, కోహినూర్ క్యాంపస్ వాణిజ్య విభాగం విద్యార్థులు శుక్రవారం విశాఖ పోర్ట్ అథారిటీని సందర్శించారు. వారికి పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్, అధికారులు సాదర స్వాగతం పలికారు. పోర్ట్‌లో ఉన్న ఆర్థిక అవకాశాలు, దిగుమతి-ఎగుమతి సౌకర్యాలు, పోర్ట్ నిర్వహణా విధానాలను విద్యార్థులకు అధికారులు వివరించారు.

ఫార్మా కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

నిబంధనలకు నీళ్లొదలిన కంపెనీలు - పర్యావరణానికి పాతర
ఇబ్బందుల్లో తాడి, తానాం, భరణికం, పరవాడ, లంకెలపాలెం వాసులు
చోద్యం చూస్తున్న కాలుష్య నియంత్రణ మండలి


ఫార్మా వ్యర్థాలతో నిండిన మొల్లోడు గెడ్డ

ప్రజాశక్తి - పరవాడ

రాంకీ ఫార్మా సిటీలోని కంపెనీల కాలుష్యకాటుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రసాయన వ్యర్థాలు భూమిలోకి జొరబడి తాగునీటిని విషతుల్యంగా మారుస్తుండటంతో వారంతా ఆర్తనాదాలు చేస్తున్నారు. ఫార్మా కంపెనీల సమీప పల్లెలు కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడుతుంటే అధికారులు, పాలకులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఫార్మా కంపెనీల కాలుష్యానికి పరవాడ మండలంలోని మొల్లోడు గెడ్డ, పలు చెరువులు, కాలువలు ప్రత్యక్ష తార్కాణాలు. చాలా గ్రామాల్లో ఎక్కడికక్కడ ఫార్మా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కంపెనీల సమీపంలోని గ్రామాల ప్రజలు జల, వాయు కాలుష్యం బారిన పడుతున్నారు. కీళ్లనొప్పులు, శ్వాసకోశ. మూత్రపిండాల వ్యాధులు, కేన్సర్ సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ ప్రాంతంలోని భూములు ఏ పంటకూ పనికి రాకుండా పోతున్నాయి. ఫార్మా కంపెనీలు శుద్ధి చేయకుండా వ్యర్థ జలాలను, వ్యర్థాలను కాలువల ద్వారా భూమిలోకి వదలడంతో భూగర్భజలాలు విషతుల్యంగా మారిపోతున్నాయి. బోర్ల నుంచి వస్తున్న నీరు పూర్తిగా రసాయనాలతో నిండి ఉంటోంది. నీటిలో ఒక్కొక్కసారి నురగ, తెట్టు కనిపిస్తున్నాయి. వరి వేస్తే దిగుబడులు రావడం లేదని, కూరగాయలు పండిస్తే కాపురావడం లేదని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదముషిడివాడ చెరువులోకి ఇటీవల ఫార్మా కంపెనీలు వ్యర్థ రసాయనాలను వదిలిపెట్టాయి. దీంతో మత్స్య సంపద దెబ్బతింది. కొద్ది నెలల క్రితం ముత్యాలమ్మపాలెం ఉప్పు టేరులో చేపలు మత్యువాత పడ్డాయి. ఫార్మా కంపెనీల తీరు వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫార్మా పరిశ్రమల ప్రభావం మూగ జీవాలనూ వెంటాడుతోంది. భూగర్భజలాల వల్ల పండిన గడ్డిని తినడం వల్ల ఆవులు, గేదెల్లో వ్యాధులు సంక్రమిస్తున్నాయి. గర్భం-చూడి నిలవడం లేదు. దీంతో మూగజీవాలను సాకడం భారంగా మారి రైతులు వాటిని కబేళాలకు అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో ప్రజల మనుగడకు ముప్పు ఏర్పడుతోందని కార్మిక సంఘాల నాయకులు ఇటీవలే జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు కలుషితమవుతోంది

మా గ్రామానికి ఆనుకుని ఫార్మా కంపెనీలు ఉన్నాయి. వాటి తీరుతో తాగునీరు కలుషితమవుతోంది. 20 లీటర్ల క్యాన్‌ను రూ.20 ఇచ్చి కొనుక్కుని తాగుతున్నాం. తాగునీటి కోసం ప్రతి కుటుంబం రోజుకు రూ.80 వెచ్చించాల్సి వస్తోంది. రాంకీ వారు రోజుకు ఒక కుటుంబానికి ఒక లీటర్ మాత్రమే ఇస్తున్నారు. మా గ్రామాన్ని వేరొక చోటుకు తరలిస్తామని ఈ ప్రాంత నాయకులు అనేకమార్లు చెబుతూ వచ్చారు. అది జరగలేదు.

కందిపల్లి పెంటయ్య, తాడి గ్రామం

వ్యవసాయానికి ముప్పు

పూర్వం నుంచీ మాకు వ్యవసాయమే ఆధారం. ఫార్మా వ్యర్థ జలాలతో మా భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. వరి వేస్తే దిగుబడి రావడం లేదు. కూరగాయలు పండటం లేదు. పశువులు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నాయి. ఫార్మా వ్యర్థ జలాల దుర్వాసనను భరించలేకపోతున్నాం. మా గ్రామాన్ని వేరొక చోటుకు తరలించాలి.

మాసారపు మహాలక్ష్మి, తానాం గ్రామం

వ్యాధుల బారిన పడుతున్నాం

మా గ్రామాన్ని ఆనుకుని ఉన్న మొల్లోడు గెడ్డలోకి ఫార్మా వ్యర్థాలు చేరుతున్నాయి. మా భూభాగమంతా కలుషితమవుతోంది. ఇటీవలే మా గ్రామంలోని బోరు బావుల వద్ద నీరు తాగిన వారంతా డయేరియా బారిన పడ్డారు. మా ప్రాంతంలో ఉన్న చెరువుల్లో చేపలు అనేకసార్లు మృత్యువాత పడ్డాయి. రైతులు తీవ్ర నష్టాలపాలయ్యారు.

జెర్రిపోతుల చంద్రరావు, భరణికం గ్రామం

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను ఉద్యమాలతో తిప్పికొడతామని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని సిఐటియు విశాఖ జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారమూ కొనసాగాయి. ఈ దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని, ఈ కర్మాగారం 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిందని గుర్తుచేశారు. దీన్ని ప్రైవేటీకరించాలని చూడటం దారుణమన్నారు. నాలుగేళ్లుగా ఉక్కు పరిరక్షణ పోరాటం కొనసాగుతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయమన్నారు. కార్మిక, కర్షక, ప్రజా ఉద్యమాలను నేరుగా ఎదుర్కోలేక దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ముడి సరుకు అందకుండా చేయడం, బ్లాస్ట్ ఫర్నేస్‌లను నిలిపివేయడం, కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం.. వంటి చర్యలకు ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం పాల్పడటం తగదన్నారు. ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. దీక్షల్లో ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులు పాల్గొన్నారు.


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సామాన్యులకు బ్యాంకర్లు సహకరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సామాన్యులు, రైతుల ఆర్థిక అభ్యున్నతికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని బ్యాంకర్లను ఉద్దేశించి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో రెన్యువల్ చేయాలని, రైతులకు, ఎంఎస్ఎంఇ ఔత్సాహికులకు అండగా నిలవాలని సూచించారు. దరఖాస్తుదారుకు వీలైనంత త్వరగా సమాధానం చెప్పాలని, పదేపదే బ్యాంకుల చుట్టూ తిప్పించుకోరాదని హితవు పలికారు. ఏదైనా సందర్భంలో దరఖాస్తును తిరస్కరిస్తే దానికి గల కారణాలను దరఖాస్తుదారుకు వివరించాలని సూచించారు. వ్యవసాయ, విద్యా సంబంధిత రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పారిశ్రామిక ఔత్సాహికులకు, స్వయం ఉపాధి పొందే వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల గురించి సమీక్షించారు. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. నాబార్డు ద్వారా అందే ఆర్థిక సాయం, అమలయ్యే ప్రాజెక్టులు, గృహ రుణాల మంజూరు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌బిఐ ప్రతినిధులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు, డిఆర్‌డిఎ, యుసిడి పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యతా లోపం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి జంక్షన్ నుండి ఉమ్మడివరం, చింతూరు వరకు వెళ్లే రహదారి మరమ్మతు పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారు. విఆర్.పురం - చింతూరు ప్రధాన రహదారి 35 కిలోమీటర్ల మేర అడుగడుగునా గోతులు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ గోతుల వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ రహదార మరమ్మతు పనులు మంజూరు చేశారు. అయితే ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారుడు ఈ మరమ్మతు పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారు. గోతుల్లో వేసిన చిప్స్ రాయిపై కనీసం తారు కూడా పోయకుండా గుంతలు పూడ్చారు. దీనిపై గుత్తేదారుడిని వివరణ కోరగా తాము ఇలాగే చేస్తామని సమాధానం ఇస్తున్నారు. ప్రభుత్వం రహదారులు వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుంది తప్ప గిరిజన ప్రాంతాల్లో ఆ పనులు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షణ లేకుండా పోయిందని పలువురు అంటున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతతో రహదారి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తారు వేయకుండా
రాళ్లు మాత్రమే వేసి వదిలేసిన దృశ్యం